క్లుప్తంగా

ఘనంగా ప్రదోషకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కం డ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ప్రదోష కాల పూజలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా శివునికి నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకుముందు వేకువజామునే కొండ మల్లీశుని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. సాయంత్రం నందీశ్వరునికి పాలు, పెరుగు, పసుపు, కుంకుమతో అభిషేకించారు. తదుపరి ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

31న మండల మీట్

వెదురుకుప్పం: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 31న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుధాకరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

రాగి పంట సాగుపై అవగాహన



రాగి పంటను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

పాలసముద్రం : మండల పరిధిలోని రైతన్నలు చిరుధాన్యాల పంటల సాగులో రాగి పంట సాగుపై శ్రద్ధ పెట్టాలని ఏఓ మహబూబ్‌బాషా తెలిపారు. సోమవారం నరసింహపురం రైతు భరోసా కేంద్రంలో ఏఓ డిల్లీప్రసాద్ ఆధ్వర్యంలో రైతులతో సమీక్ష నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి మహబూబ్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వం 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఆర్‌బీకే సిబ్బంది తమ పరిధిలోని గ్రామాల్లో రైతులు రాగి పంటను సాగు చేసే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. రాగి పంటకు గిట్టుబాటు ధర కిలో రూ.38 నిర్ణయించడం జరిగిందన్నారు. రాగి సాగుకు ఖర్చు తక్కువ, దిగుబడి, ఆదాయం చాలా ఎక్కువన్నారు. రైతులు చిరుధాన్యాల సాగుపై శ్రద్ధపెట్టాలని కోరారు. అనంతరం నరసింహపురం సమీపంలో రైతు సాగు చేసిన రాగి పంటను పరిశీలించి వివరించారు.


ఇంటి వద్దే ప్రభుత్వ వైద్యం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ పల్లవి

శ్రీరంగరాజపురం : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఇళ్ల వద్దకే ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యమని మండల వైద్యాధికారి డాక్టర్ పల్లవి అన్నారు. సోమవారం ముద్దుకుప్పం సచివాలయ పరిధిలోని చొక్కమడుగు ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌ను నిర్వహించారు. ఈ వైద్య పరీక్షలకు వచ్చిన రోగులు, గర్భిణులకు పలు సలహాలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ పాలు, కోడి గుడ్లు, చిక్కీలు, రాగి, గోధుమ, ఎండు ఖర్జూరం వంటి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహారంతో వ్యాధి నిరోధక శక్తితో పాటు పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



పెనుమూరు(కార్వేటినగరం) : మండలంలోని కారకాంపల్లిలో సోమవారం జల్‌జీవన్ పథకంలో భాగంగా తాగునీటి బోరు ఏర్పాటుకు డ్రిల్లింగ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి గ్రామానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి తాము గ్రామంలో తాగునీటి సమస్యను వివరించామన్నారు. స్పందించిన ఆయన గ్రామంలో మౌలిక వసతులతో పాటు తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం గ్రామంలో బోరు వేసి గ్రామస్తులకు తాగునీటి సమస్యలను పరిష్కరించారు.

సభా వేదిక పైనుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సభావేదికపై మంత్రులు, జిల్లా అధికారులు, విద్యార్థులతో సీఎం జగన్





విద్యాప్రదాతకు స్టూడెంట్స్ అభివాదం



ఉప్పొంగిన నగరి

- సీఎం జగన్ పర్యటన సూపర్ సక్సెస్
- భారీగా తరలివచ్చిన జనం
- కిక్కిరిసిన నగరి వీధులు
- ఉదయం ఇచ్చిన హామీలన్నీ సాయంత్రానికే పరిష్కారం
- సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న జనం



అక్కచెల్లెమ్మలకు బస్సులో నుంచి అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

నగరి పట్టణంలో ఉప్పొంగింది. ఎటుచూసినా జనసముద్రాన్ని తలపించింది. కనీవినీ ఎరుగని రీతిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతమైంది. ఆకాశం వాలిందా.. నేల ఈనిందా అనేలా ఎక్కడ చూసినా.. ఏవైపు తిరిగినా జనమే కనిపించారు. సోమవారం నగరిలో జరిగిన జగనన్న విద్యాదీవెన పంపిణీ కార్యక్రమం న భూతో న భవిష్యత్ అనేలా సాగింది. తెలుగు ప్రజలు ఒక్కసారి ఎవరిపైన అయినా అభిమానం పెంచుకుంటే చివరిదాకా వెంట నడుస్తారనే మాటను అక్షరసత్యం చేస్తూ తమ అభిమాన నాయకుడు జగన్‌ను చూడడానికి దిక్కులు పిక్కటిల్లేలా జనం కదలివచ్చారు. దీంతో నగరి పట్టణం ఉప్పొంగుతున్న కుశస్థలి నదీ ప్రవాహంలా జనప్రవాహాన్ని తలపించింది. కీళపట్టు హెలిప్యాడ్ నుంచి సభాస్థలి వరకు సుమారు రెండు కిలోమీటర్ల వరకు రోడ్డుపై జనం బారులు తీరారు. తమ బిడ్డల చదువుల కోసం అమ్మఒడి, వసతి దీవెన, విద్యాదీవెన, లెక్కలేనన్ని సంక్షేమ పథకాలను అందించి ఆదుకుంటూ పేదవాడి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి కీర్తిప్రతిష్టలు పొందుతున్నారు. తాము దైవంగా కొలిచే, అభిమానించే నాయకుడు జగనన్నను ఒక్కసారైనా చూడాలన్న తల్లులు, తమకు గోరుముద్దనందిస్తున్న మేనమామను చూడాలని తపించిన పిల్లలు, సంక్షేమ పథకాలతో భరోసా కల్పిస్తున్న జనహృదయ నేతను చూడాలని మహిళలు, వయస్సు మీద పడిన తమకు పింఛన్ అందిస్తూ ఆదుకుంటున్న మనుమడిని చూడాలన్న అవ్వాతాతలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రియతమ నేత, సీఎం వైఎస్ జగన్‌ను చూసి మురిసిపోయారు. -నగరి



నగరిలో ఆకట్టుకున్న ఆత్మీయ స్వాగత కటౌట్లు



సీఎం సభకు విచ్చేస్తున్న విద్యార్థినులు





అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఆత్మీయ స్వాగతం

ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసి స్వాగత తోరణాలు, ఆర్చిలు, ఫ్లెక్సీలు, కటౌట్లతో పట్టణం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ముఖ్యమంత్రి హోదాలో తొలిసాగి నగరికి విచ్చేసిన జగనన్నపై ప్రజలు పూలవాన కురిపించారు. నగరి కీళపట్టు వద్ద ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ నుంచి సాయి దివ్యదామం సమీపంలో ఏర్పాటుచేసిన సభాస్థలికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేరుకునే వరకు ప్రజలు రోడ్డుకిరువైపులా నిలబడి స్వాగతం పలికారు.

పకడ్బందీ ఏర్పాట్లు

ముఖ్యమంత్రి సభకు భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఎక్కడా తోపులాటలు, తొక్కిసలాటలు జరగకుండా ప్రత్యేకంగా గ్యాలరీలు ఏర్పాటు చేశారు. సభకు హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సైతం సభకు హాజరై తిరిగి వెళ్లేంతవరకు పక్కాగా సౌకర్యాలు కల్పించారు. నభూతో నభవిష్యత్ అన్న రీతిలో సీఎం సభ సక్సెస్ కావడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. నియోజకవర్గ చరిత్రలో ఇలాంటి భారీ సమావేశం జరగలేదని, ఈ స్థాయిలో జనం హాజరుకాలేదని సంతోషం వ్యక్తమైంది. సీఎం జగన్ హామీలన్నీ సాయంత్రానికే పరిష్కారం కావడంతో జనం ఆనందం వ్యక్తం చేశారు.







నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల నుంచి సీఎం సభకు భారీగా విచ్చేస్తున్న ప్రజలు

పురవీధుల్లో సీతారాముల చిద్విలాసం



పురవీధుల్లో ఊరేగుతున్న కోదండరామస్వామివారు



ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న వేదపండితులు

కార్వేటినగరం: తెప్పోత్సవ వేడుకలను పురస్కరించుకుని సోమవారం శ్రీసీతా కోదండరాముల వారు పురవీధుల్లో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేకువజామున స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన వంటి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి మూల విరాట్‌ను పట్టువస్త్ర సుగంధర భరిత పుష్ప మాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం 9 గంటలకు శ్రీసీతాకోదండరాముల వారి ఉత్సవ విగ్రహాలతో పాటు లక్ష్మణ, ఆంజనేయ స్వామివారి విగ్రహాలకు వేద పండితులు వేద మంత్రాల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చి పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సురేష్‌కుమార్, టీటీడీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

అమ్మభాషకు అగ్రతాంబూలం

- నేడు తెలుగు భాషాదినోత్సవం
- అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో సంబరాలు



గిడుగు వెంకట రామ్మూర్తి

పుత్తూరు రూరల్: మాటనైనా, పాటనైనా స్పష్టంగా, సరళంగా చెప్పగలిగే, పాడగలిగే అక్షరాల సమూహమే మన తెలుగు భాష ప్రత్యేకత. నాటి నుంచి నేటి వరకు ఎందరో మహానుభావులు తెలుగు భాష ఉన్నతికి ఎనలేని కృషి చేస్తున్నారు. తెలుగు వ్యవహారిక భాష ఉద్యమకర్త గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 29వ తేదీని తెలుగు భాషాదినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. రాష్ట్రప్రభుత్వం అమ్మభాషగా పిలుచుకుంటున్న



తెలుగు భాషకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. నేడు అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో తెలుగు భాష దినోత్సవాన్ని జరుపుకోనున్నారు.

తెలుగులోనే పాలనా వ్యవస్థ ఉండాలి..



తెలుగు రాష్ట్రాల పాలనా వ్యవస్థ తెలుగులోనే అమలు కావాలి. కోర్టుల్లో జరిగే వాద ప్రతివాదనలు, తీర్పులు తెలుగులోనే ఉండాలి. వాణిజ్య సంస్థల పేర్లు, ప్రకటనలు తెలుగులోనే ఉండాలి. ఇలా ప్రతి విషయంలో తెలుగు వారందరూ తెలుగు భాషాభివృద్ధికి నడుం బిగించాలి. తెలుగు భాషను మరచిపోతున్న నగర యువతకు దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నాలుగేళ్లకోసారి ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహిస్తామన్న 2012 నాటి తీర్మాణాన్ని అమలు చేయాలి. తెలుగు భాషాభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యతగా స్వీకరించాలి.

– డాక్టర్.ఎం.నరసింహులు, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు

భాష పరిరక్షణకు కృషి చేయాలి..



తెలుగు భాష పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి. ఇటీవల కాలంలో అన్ని రంగాల్లో తెలుగును అమలు చేయాలని, లేనిపక్షంలో అపరాధ రుసుము వసూలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇది ఆహ్వానించ దగ్గ విషయం. దీనిని నిక్కచ్చిగా అమలు చేయడం ద్వారా ప్రజల్లో భాషాభిమానం పెంపొందించవచ్చు. పిల్లలకు తెలుగు పదాలు, పద్యాల ఉచ్ఛరణను నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనా ఉంది. ప్రభుత్వం తెలుగు బాషాభివృద్ధికి తగిన ప్రోత్సహాలను సైతం అందించాలి. ప్రపంచవ్యాప్తంగా మన తెలుగువారు ఉన్నారని చెప్పడం గర్వంగా ఉంటుంది.

– బి.భాస్కర్‌రాజు, అధ్యక్షుడు, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం. పుత్తూరు.

పిల్లల్లో తెలుగుపై ఆసక్తి పెంచాలి..



తల్లిదండ్రులు తమ పిల్లలకు మాతృభాష అయిన తెలుగు పట్ల ఆసక్తికి పెంపొందించాలి. మాతృభాష ఔన్నత్యాన్ని తెలియజెప్పాలి. పిల్లల చేత తెలుగు గేయాలు, పద్యాలు పాడించాలి. చిన్నచిన్న కథలు చెప్పడం ద్వారా వారిలో ఆసక్తిని పెంపొందిచవచ్చు. వారిచే కథల పుస్తకాలు, దినపత్రికలు చదివించాలి. బాల్యంలోనే గట్టి పునాది పడాలి.

– ఆర్‌సీ కృష్ణస్వామిరాజు, కథా రచయిత, రాచపెళెం, పుత్తూరు.

పరభాషా కోవిదులు సైతం మెచ్చిన తెలుగు



పర భాషా కోవిదులు, విదేశీయులు సైతం తెలుగు భాష కీర్తిని శ్లాఘించారు. విదేశీయుడైన బ్రౌను దొర తెలుగు నిఘంటువు రాసిన ఘనమైన భాష మనది. అపార భాషా ప్రియులైన తమిళ కవులు సైతం తెలుగు భాషను సుందరమైన భాషగా అభివర్ణించారు. ప్రపంచవ్యాప్తంగా మన తెలుగు భాష ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా పేరుగాంచింది.

– డి.సురేంద్ర, కవి, రచయిత, ఉపాధ్యాయుడు, జెడ్పీ హైస్కూల్, వడమాలపేట

దాతల సాయం మరువలేనిది



దాత స్వర్ణ రవికుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పట్ల దాతలు దాతృత్వం చాటుకోవడం అభినందనీయమని బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గాయత్రీదేవి అన్నారు. స్వర్ణ రవికుమార్ మూడవ వర్ధంతిని పురస్కరించుకుని జూనియర్ కళాశాల విద్యార్థులు 35 మందికి రూ.50 వేలు విలువ చేసే యూనిఫాంను స్వర్ణ రమేష్ కుటుంబ సభ్యులు సోమవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులను ప్రోత్సహించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలో చదువు కోవడానికి పేద విద్యార్థులు తప్పా ఉన్నతవర్గాల వారి పిల్లలు వచ్చేవారు కాదన్నారు. కానీ నేడు ప్రభుత్వం స్కూళ్లను కార్పొరేట్ స్థాయిలో రూపుదిద్దుతుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించడానికి ఉన్నతస్థాయి వర్గాల పిల్లలు సైతం ముందుకు వస్తున్నారని గుర్తు చేశారు. దాతల దాతృత్వాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నతస్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు దాత స్వర్ణరమేష్‌ను శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, రాజ్యలక్ష్మి, అనూరాధ, రాణి, సాహితి, శృతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.